


# మనం
## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

ఆదివారం | 15 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8


# సమరానికి సై

- మూడోసారి 'హుస్నాబాద్' నుండే సమరశంఖం
- బహిరంగ సభ..కేసీఆర్ బహుముఖ ఆయుధం
- జనాన్ని ఒప్పించే పసంగం..మెప్పించే చాతుర్యం
- చేసింది చెప్పి ఓట్లడిగే చేవ..ఆయనంటే నమ్మకం
- విపక్షాల ఆట మొదలవ్వక ముందే జనం గుండెల్లో గులాబీ జెండా
- గులాబీ గర్జనకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన వినోద్, సతీశ్‌కుమార్

హుస్నాబాద్,అక్టోబర్ 14,(మనం న్యూస్): ఆ గొంతు వింటే ఒక ధైర్యం..ఆయన మాట్లాడితే ఒక భరోసా..పిడికిలెత్తి నినదిస్తే ఒక ఉత్సాహం..ఆ వ్యక్తి..శక్తి..కేసీఆర్..నాయకుడికి నిర్వచనం అడిగితే కేసీఆర్ పేరొక్కటి చాలు. అందుకే తెలంగాణ ప్రజల వెనుక నిలిచాడు. వెంటనడిచారు. కేసీఆర్‌కు పదవులంటే లెక్క లేదు. అందుకే తెలంగాణ కోసం పలుమార్లు రాజీనామా పత్రమై రణగర్జన చేసారు. ఎన్నికలంటే ఎన్నడూ వెనక్కి తగ్గలేదు. ప్రతీసారి బ్యాలట్‌తో జనబాహుళ్యపు బావుటాయై మరింత పైకి లేచారు. ఎన్నికలొస్తే నా అంత కూల్‌గా ఎవరూ ఉండరు..అని కేసీఆర్ మాత్రమే

మిగతా 2లో..





## ఒక్కేసి పువ్వేసి చందమామ...

### తొలి రోజు ఆడపడుచుల ఆటా పాట



8లో

# సెంటిమెంట్ ఒకే...అభివృద్ధి ఏదీ

- బీఆర్ఎస్, బీజేపీలది రాజకీయ క్రీడ
- ప్రవళికది ఆత్మహత్య కాదు బీఆర్ఎస్ ప్రభుత్వ హత్య
- ప్రజలిచ్చే తీర్పుతో దిమ్మతిరిగేది బీఆర్ఎస్‌కే
- హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల ఎందుకివ్వలేదు
- కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్



హుస్నాబాద్,అక్టోబర్ 14,(మనం న్యూస్): హుస్నాబాద్ ఎన్నికల సెంటిమెంట్ అంటూ సినిమా డైలాగులు బాగానే కొడుతున్నారు...హుస్నాబాద్ అభివృద్ధి ఎందుకు జరగలేదంటూ కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రశ్నించారు. పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే సొరంగ మార్గం, కట్ట నిర్మాణంతో పాటు 80 శాతం పనులు పూర్తి చేసామన్నారు. తెలంగాణ వచ్చాక కుర్చీ వేసుకొని ప్రాజెక్టులను కడుతా ఏవడు అడ్డం వస్తాడో చూస్తా అన్న కేసీఆర్‌కు ఏవరం అడ్డం పోలేదన్నారు. పునరావస సమస్యలు పరిష్కరించకుండా ప్రాజెక్టును పూర్తి చేసుకున్నట్టా

మిగతా 2లో..

# సమరానికి సై



మొదటి పేజీ తరువాయి..

చెప్పగలరు. అలా ఉండగలరు కూడా. తెలంగాణ ప్రజల పై ఆయన చెక్కుచెదరని నమ్మకం, ప్రజలకు ఆయన పై అచంచల విశ్వాసం. అంతులేని అభిమానం. అధికారిక సమావేశాల్లో రాజనీతిజ్ఞుడిగా విషయ పరిజ్ఞానంతో మాట్లాడే కేసీఆర్..ఎన్నికల సమరాంగణంలో బక్కపలచని యుద్ధభేరిగా మారిపోతారు. బహిరంగ సభ..కేసీఆర్ బహుముఖ ఆయుధం. అందుకే ఒక్కో బహిరంగ సభ ఒక జనసునామీ. ఆ సభల్లో కేసీఆర్ మాటలు ప్రత్యర్థుల పై మరపిరంగులై పేలనున్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని స్వప్నించి, సాధించిన కేసీఆర్ రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని బంగారుతునకగా మార్చారు. మూడో మలుపులో గెలుపు పిలుపుకోసం మరోసారి కేసీఆర్‌కు సెంటిమెంట్ అయిన లక్ష్మీ నియోజకవర్గం హుస్నాబాద్ నుండి రణన్నినాదం చేయబోతున్నారు. వరుసగా రెండుసార్లు హుస్నాబాద్ నుంచే ప్రచారాన్ని మొదలుపెట్టి విజయఢంకా మోగించిన గులాబీ అధినేత ఈ సారి కూడా హుస్నాబాద్ నుండే రథారూఢుడై కదలనున్నారు. చెప్పింది చేసే కేసీఆర్...చేసిందీ, చేయబోయేదీ చెప్పబోతున్నారు. నేడు సీఎం కేసీఆర్ హుస్నాబాద్‌కు వస్తున్న సందర్భంగా హుస్నాబాద్ గులాబీ మయమైంది. ఎక్కడ చూసినా గులాబీ సందడి కనిపిస్తోంది. సీఎం కేసీఆర్ సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నుండి హెలికాప్టర్‌లో హుస్నాబాద్ చేరుకొని బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అంతకుముందు హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ-ఫాంలు అందజేస్తారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నారు. సిఎం హుస్నాబాద్ బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసారు. సుమారు లక్ష మంది ఈ సభకు హాజరవ్వనున్నారు. హుస్నాబాద్ పట్టణ శివారులోని సబ్‌స్టేషన్ పక్కన సభను ఏర్పాటు చేసారు. హెలిప్యాడ్ నిర్మాణం పూర్తయింది. బహిరంగ సభ కోసం అతిపెద్ద వేదికను ఏర్పాటు చేసారు. పార్కింగ్ స్థలాలను కూడా ఏర్పాటు చేసారు. పోలీస్‌శాఖ భారీ బందోబస్తు నిర్వహిస్తోంది. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. శనివారం సభ ఏర్పాట్లను రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పర్యవేక్షించారు.

### అందరి దృష్టి హుస్నాబాద్ వైపే............

తెలంగాణ రాష్ట్రానికి ఈశాన్య ప్రాంతమైన హుస్నాబాద్ కేసీఆర్‌కు సెంటిమెంట్ , లక్ష్మీ నియోజకవర్గం అవ్వడంతో 2014, 2018 లోనూ ఎన్నికల ప్రచారాన్ని హుస్నాబాద్ నుండే ప్రారంభించి విజయఢంకా మోగించారు. ఈ సారి కూడా హుస్నాబాద్ నుండే ఎన్నికల ప్రచారం ప్రారంభించనుండటంతో రాష్ట్ర రాజకీయ వర్గాల దృష్టి హుస్నాబాద్ వైపు మళ్లింది. సీఎం హుస్నాబాద్ వేదికగా ఏమి సందేశం ఇస్తారో అనే విషయం పై ఆసక్తి నెలకొంది. ఆయన ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలతో పాటు గడిచిన పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రతిపక్షాల పై పదునైన విమర్శలు చేసే అవకాశం ఉంది.

### హుస్నాబాద్ గులాబీలో జోష్..........

సీఎం కేసీఆర్ ఎన్నికల తొలి ప్రచార సభ నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ గులాబీ పార్టీలో జోష్ నెలకొంది. ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు ఉత్సాహంగా కదం తొక్కుతున్నాయి. సీఎం సభకు జనసమీకరణకు గత మూడు రోజుల నుండి పార్టీ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. మండలాల వారిగా గ్రామాల వారిగా జనసమీకరణకు లక్ష్యాలు నిర్దేశించారు. వాహనాలు ఏర్పాటు చేసారు. బతుకమ్మ, కోలాటలు, డప్పు చప్పుళ్లు, నృత్యాలతో ఉత్సాహంగా సభకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసారు.

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నాయకత్వంలో గులాబీ పార్టీ బలంగా ఉంది. పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గడిచిన పదేళ్లలో జరిగాయి. ఈ అంశాలు సీఎం కేసీఆర్ సభలో ప్రసంగించే అవకాశం ఉంది. గడిచిన పదేళ్లలో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని, గోదావరి జలాలతో నియోజకవర్గం సస్యశ్యామలం అయ్యింది.

### రాజకీయంగా గులాబీదే ఆధిపత్యం............

హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది. ఇక్కడి నుండి ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ 2014 లో మొదటిసారి 34 వేల మెజార్టీతో, 2018 లో రెండవసారి 70 వేల మెజార్టీతో విజయం సాధించారు. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు తనయుడైన వొడితల సతీశ్‌కుమార్ ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. వివాద రహితుడిగా, మృదుస్వభావిగా, మంచి ప్రజాప్రతినిధిగా, మచ్చలేని నేతగా సతీశ్‌కుమార్‌కు పేరుంది. తెలంగాణ ఉద్యమ సమయం నుండి హుస్నాబాద్‌లో గులాబీ పార్టీ తన ప్రభావాన్ని చాటుతూ వస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ప్రభావం చూపుతూ వస్తోంది. మెజారిటీ ప్రజాప్రతినిధులు గులాబీ పార్టీ వైపే ఉన్నారు. మూడోసారి కూడా భారీ మెజారిటీ విజయం దిశగా సతీశ్‌కుమార్ దూసుకుపోతున్నారు. పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు ఆయన కృషి చేసారు. ఇంకా ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల ఖరారు కాకముందే ఎమ్మెల్యే సతీశ్ ప్రజలతో మమేకమై ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్ సభతో గులాబీ పార్టీలో మరింత జోష్ వస్తుందని భావిస్తున్నారు.

# బీజేపితోనే దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి

**-నియోజకవర్గ అభివృద్ధికి బిఆర్ఎస్ అడ్డంకి**

**-సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు**

**-దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు**



దుబ్బాక, అక్టోబర్ 14, మనం న్యూస్: భారతీయ జనతా పార్టీతోనే దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని దుబ్బాక ఎమ్మెల్యే, దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. శనివారం రోజున దుబ్బాక పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద తొగుట మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన, పెద్దచీకోడు గ్రామానినకి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బీజేపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి బీజేపిలోకి భారీగా వలసలు జరుగుతున్నాయన్నారు. నేడు దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి బిఆర్ఎస్ అడ్డంకిగా మారిందని, ఆ అడ్డంకిని తొలగించుకోవడానికి నియోజకవర్గ ప్రజలంతా ఓటు అనే వజ్రాయుధంతో ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉంటే నిధులివ్వని ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా తమను తాము చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా కక్షతో పక్షపాత ధోరణితో వ్యవహరించే బిఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, బిఆర్ఎస్ నాయకుల మాయమాటలకు ప్రజలు దుబ్బాక ప్రజలు మోసపోరన్నారు. వచ్చే ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై మరోసారి బీజేపి పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.

# సెంటిమెంట్ ఒకే...అభివృద్ధి ఏదీ

మొదటి పేజీ తరువాయి..

చేసుకోనట్టా నేడు సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. రైతుల కోసం ఒక మెట్టు దిగి ప్రతిపక్ష నాయకులమైనప్పటికి మంత్రి హరీశ్‌రావు దగ్గరికి చర్చల కోసం వెళ్లడం జరిగిందని ఆయన గుర్తు చేసారు. రాష్ట్రంలోని శాసనసభ్యులు ముఖ్యమంత్రి ఆపాయింట్‌మెంట్ కోరుతుంటే హుస్నాబాద్ లో మాత్రం ముఖ్యమంత్రే స్థానిక శాసనసభ్యుడి ఇంటికి వచ్చిన అభివృద్ధి గురించి అడగకపోవడం సిగ్గుచేటన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాలు ఎలా అభివృద్ధి చెందాయో కేసీఆర్‌కు సెంటిమెంట్ అయిన హుస్నాబాద్ నియోజకవర్గం ఎందుకు అభివృద్ధి చెందలేదో చెప్పాలన్నారు. ప్రజలకు ఇష్టం లేకున్నా హుస్నాబాద్‌ను సిద్దిపేట జిల్లాలో కలిపారని అటువంటపుడు హుస్నాబాద్‌కు ఎందుకు మెడికల్ కళాశాల కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రతి గడప గడపకు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రామిసరి నోట్లలాంటివని, ఆర్ గ్యారం టీల పై ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలను ఆశ్రయిస్తే నేరుగా మీ వద్దకే వచ్చి ఇస్తారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి మించిన మరోక రాజకీయ పార్టీ లేదన్నారు. దీనికి నిదర్శనమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అన్నారు. 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీనైనా అమలు చేయలేదా చెప్పండి అంటూ సవాలు విసిరారు. డబుల్ బెడ్ రూమ్‌లు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్ని కట్టించింన్రు అంటూ ఆయన ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఏమైందంటూ ఆయన మండిపడ్డారు. బిస్వాల్ కమిటీ చెప్పినట్టుగా 2,91,000 ఖాళీలుంటే ఆ ఖాళీలను నింపే ప్రయత్నం చేయలేదన్నారు. డిఎస్సీ, గ్రూపు-1 2014 నుండి ఇప్పటి వరకు పడలేదు పడ్డది ఒకటి పరీక్షలు రాసిన తర్వాత పేపర్ లీకేజీలు యువత భవిష్యత్తును ఆగం చేసారని ఆయన మండిపడ్డారు. టిఎస్‌పిఎస్‌సిలో అవకతవకలతో మనోవేదనకు గురైన విద్యార్థులు ఆత్మహత్మ లకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రవళికది ఆత్మహత్య కాదు..బీ ఆర్ఎస్ ప్రభుత్వ హత్య అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆడకుంటుందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల కోసం విద్యార్థులు అప్పుల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. పరీక్షల నిర్వహణలో తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. అవినీతికి నిలయంగా టి.ఎస్.పి. ఎస్.సి.మారిందన్నారు. కేసీఆర్ హుస్నాబాద్‌కు రండి...సెంటిమెంట్ ఓకే కానీ డెవలప్‌మెంట్ మీద నిర్లక్ష్యం ఎందుకు జరిగిందో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. సినిమా డైలాగులు మాట్లాడి నేను వెళ్లిపోతా అంటే ప్రజలు ఇవ్వాళ మార్పు కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేసారు. కేంద్రం మిమ్మల్ని, మీరు కేంద్రంను తిట్టినట్టు చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల వ్యతిరేకతను తగ్గించుకోవడానికి బీజేపీ, బీఆర్ ఎస్ డ్రామాలు ఆడుతున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రజలు మార్పు కోరు కుంటున్నారని, ఇంటింటికి బంగారం పంచినా బీఆర్ఎస్‌ను ప్రజలు విశ్వసిం చలేరన్నారు. బిఆర్ఎస్ అబద్ధాల ప్రభుత్వమని ప్రజలందరికీ తెలిసిపో యిందన్నారు. ప్రజలు ఇచ్చే తీర్పుతో బిఆర్ఎస్ నేతల దిమ్మతిరగనుందన్నారు. గృహాలక్ష్మీ, దళితబంధు పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారంటూ ఆయన ఆరోపించారు. ల్యాండ్ సాండ్ మాఫియాల వద్ద వసూలు చేసిన పైసలు బీఆర్ఎస్ దగ్గర ఉన్నాయన్నారు. రాష్ట్రం మొత్తం రూ.57 కోర్టులు మంజూరు అయితే హుస్నాబాద్ నియోజకవర్గ వివాదాల పరిష్కారం కోసం ఒక సబ్‌కోర్టును మంజూరు చేయకపోవడం పై కేసీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, కరీంనగర్ డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్ నేత, ఆయా మండలాల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, బంక చందు, మంద ధర్మయ్య, కంది తిరుపతిరెడ్డి, నాయకులు ఎం.డీ.హసన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, రాష్ట్ర మహిళా నాయకురాలు బోనగిరి రజిత, నాయకులు ఎం.డీ.హసన్, మల్లేష్‌యాదవ్, యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్ ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# ప్రచారం కాదు... పతనమే



## భూనిర్వాసితులు, ప్రతిపక్షాలపై పెట్టిన కేసులను విత్‌డ్రా చేసుకోవాలి

### సంక్షేమ పథకాలన్నీ బీఆర్ఎస్ నేతలకే

### ప్రవళికది ప్రభుత్వ హత్యే

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

హుస్నాబాద్,అక్టోబర్ 14,(మనం న్యూస్)ః బీఆర్ఎస్ నిర్వహించే ప్రచార సభ నుండే కేసీఆర్ పతనం ప్రారంభమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యకర్తలతో కలిసి శనివారం బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతి సారి ఎన్నికల్లో హుస్నాబాద్ సెంటిమెంట్ అంటూ ఇక్కడి నుండే ప్రచారం మొదలు పెడుతారు కానీ ఇక్కడ అభివృద్ధి మాత్రం చేయరా అంటూ ఆయన ప్రశ్నించారు. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌లాగా హుస్నాబాద్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. అభివృద్ధిలో వెనుకపడ్డది శాసనసభ్యుడికి కనబడుతలేదా అంటూ ఆయన ప్రశ్నించారు. పదేండ్లలో ఎన్నో ప్రాజెక్టులు కట్టారు కానీ సిద్దిపేట జిల్లాలో కూడా రంగనాయకసాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసారు అన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. ఎటువంటి కాలువలు తీయకుండానే గౌరవెల్లి ప్రాజెక్టు ట్రయల్‌రన్ చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఆరోపించారు. భూనిర్వాసితులను అర్ధరాత్రి పోలీసులతో దాడి చేపించి రైతులకు సంకేళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది అన్నారు. నిర్వాసితులు, ప్రతిపక్షాల పైన అక్రమంగా పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే విత్‌డ్రా చేసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. గొడవకు కారణమైన బీఆర్ఎస్ నాయకుల పై పోలీసులు ఎందుకు కేసులు నమోదు చేయలేదన్నారు. కేసులను విత్‌డ్రా చేసుకోకపోతే ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో తిరిగే ప్రసక్తే లేదన్నారు. హుస్నాబాద్ అభివృద్ధి పై ఏ గ్రామంలోనైనా చర్చకి సిద్ధమే అన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దళితబంధు, గృహలక్ష్మి, పథకాలన్నీ బీఆర్ఎస్ నేతలకే ఇస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారని ఆయన తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక అర్హులకే సంక్షేమ పథకాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రవళికది ఆత్మహత్య కాదు...ప్రభుత్వ హత్యేనని ఆయన ఆరోపించారు. నేడు జరిగే సభలో ప్రవళిక ఆత్మ శాంతి కోసం బీఆర్ఎస్ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించాలని ఆయన కోరారు. నిర్వాసితుల, ప్రతిపక్ష నాయకుల పై పెట్టిన కేసులను విత్‌డ్రా చేసుకోకపోతే సీఎం కేసీఆర్ సభను అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్, చిగురుమామిడి మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కౌన్సిలర్‌లు దొడ్డి శ్రీనివాస్, కోమటి స్వర్ణలత, బీజేవైయమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని సతీశ్, జిల్లా అధికార ప్రతినిధి రామంచ మహేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మాచర్ల కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు, నాయకులు కోమటి సత్యనారాయణ, అక్కు శ్రీనివాస్, గణేశ్, వంగర మల్లేశం, తదితరులున్నారు.



## నేటి నుండి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### ఉత్సవాలకు సర్వం సిద్ధం

### శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులు కర్ణాకర్



మిరుదొడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్ః అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవ కమిటీ అధ్యక్షులు కర్ణాకర్ అన్నారు. శనివారం మిరుదొడ్డి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ శ్రీ దుర్గా మాత అమ్మవారి ప్రతిష్ట కోసం మండపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 15 నుండి 24 వరకు జరిగే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈనెల 15న స్వర్ణాలంకృత దేవిగా, బాల త్రిపుర సుందరి దేవిగా, 16న గాయత్రి దేవిగా, 17న లలిత త్రిపుర సుందరి దేవిగా, 18న అన్నపూర్ణ దేవిగా, 19న మహాలక్ష్మి దేవిగా, 20న సరస్వతి దేవిగా, 21న భువనేశ్వరి దేవిగా, 22న దుర్గా భవాని దేవిగా, 23న శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనుందన్నారు. కావున భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

## ముదిరాజులను బిసి-ఏలో చేర్చాలి

### అసెంబ్లీలో 11 సీట్లు ఏవరిస్తే వాళ్లకే మా మద్దతు

### ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు మందా నగేష్



హుస్నాబాద్,అక్టోబర్ 14,(మనం న్యూస్)ః రాబోయే రోజుల్లో ముదిరాజులను బిసి-డి నుండి బిసి-ఏ గ్రూపులో చేర్చడానికి ఏవరు ముందుకు వస్తారో వారికే తమ మద్ధతు ఉంటుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మత్స్యకారుల విభాగం, ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు మందా నగేష్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ముదిరాజ్ సంఘ భవనంలో నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 లక్షల మంది ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని తన కాలిగోటితో సమానంగా అనుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించడానికి ముదిరాజులు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. 60 లక్షల మంది ఉన్న ముదిరాజులకు ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ కేటాయించకపోవడం బాధకరమన్నారు. దీని ఫలితం సీఎం కేసీఆర్‌కు పక్కా కనపడుతుందన్నారు. మిగతా రాజకీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు ముదిరాజులకు 11 సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేసారు. 11 సీట్లు ఏవరూ కేటాయిస్తే వాళ్లకు తమ మద్ధతు ఉంటుందన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటేల రాజేందర్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల అధ్యక్షులను నియమించడంతో పాటు వారికి నియామకపత్రాలను ఆయన అందజేసారు. ఈ సమావేశంలో ముదిరాజు సంఘం నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.



## ఓటమి భయంతోనే ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

### -తాను సేవ చేయడు.. బిఆర్ఎస్‌ను సేవ చేయనీయడు

### -బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి

మిరుదొడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్ః దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ఓటమి భయం పట్టుకుందని బిఆర్ఎస్ మిరుదొడ్డి మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు తుమ్మల బాల్‌రాజులు అన్నారు. శనివారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా అధికారుల మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు తగదన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపే పథకం దళితబంధును నిలిపివేయాలని ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. తాను ప్రజలకు సేవ చేయకుండా, సేవ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తూ ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడం ప్రజలను విస్మరించడమే అన్నారు. జరగబోయే ఎన్నికల్లో రఘునందన్‌రావు చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా దుబ్బాక నియోజకవర్గ ప్రజలు గమనించి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు బుద్ధి చెప్తూ బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి గజ్జల సాయిలు, తెరాస నాయకులు సూకూరి లింగం, సత్యనారాయణ, సత్తయ్య, ధర్మారం బాబు, వెంకటయ్య, లింగం, మల్లయ్య, కిష్టయ్య, బైరయ్య, ఎల్లయ్యతోపాటు తదితరులున్నారు.

## జేఏసి నాయకులపై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

### జేఏసి చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్



చేర్యాల, అక్టోబర్ 14, మనం న్యూస్ః చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం అహర్నిశలు పాటుపడుతున్న జేఏసి నాయకులపై నగామ బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు జేఏసి చైర్మన్ డా. రామగల్ల పరమేశ్వర్ అన్నారు. శనివారం చేర్యాల మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజల విశిష్టత, ఆత్మగౌరవ పోరాటంలో నాలుగు మండలాల ప్రజలు భాగస్వాములై గత ఏడు సంవత్సరాలుగా డివిజన్ సాధన కోసం ఏకమై శాంతియుతంగా పోరాటాలు నిర్వహిస్తున్న నాయకులపై పట్టభద్రుల ఎమ్మెల్యే, స్థానిక తెరాస జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల జేఏసి నాయకులు అంతా కలిసినా నా ఒక్క బిఆర్ఎస్ కార్యకర్తతో కూడా సమానం కాదని మాట్లాడాడని, నీవు మా దీక్షల వద్దకు ఎందుకు వచ్చావు అని, ఆ మాట ఎందుకు చెప్పావని వారు ప్రశ్నించారు. రాజకీయ నిరుద్యోగుల పరిగణించిన మమ్మల్ని సీఎం కేసీఆర్ కూడా ఒకప్పుడు 2001 ఉద్యమంలో రాష్ట్ర పునర్నిర్మాణ ఉద్యమంలో తెలంగాణ ఉద్యమ కారులు కూడా రాజకీయ సాంస్కృతిక సమస్యల పట్ల అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రాంత ప్రజలు బిఆర్ఎస్‌కు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ సమావేశంలో జేఏసి కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఉడుముల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ చెవిటి లింగంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో

# బీజేపి చేరికలు



తొగుట, అక్టోబర్ 14, మనం న్యూస్ః దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో తొగుట మండలంలో పలువురు శనివారం బీజేపి పార్టీలో చేరారు. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన నాయకులు గ్రామ సర్పంచ్ బొడ్డు నర్సింలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు బీజేపిలో చేరిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. పార్టీకోసం కష్టపడి రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల పార్టీ అధ్యక్షులు తుక్కాపూర్, తుక్కాపూర్ సర్పంచ్ చిక్కుడు ముదిరాజ్, బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి, విభీషణ్‌రెడ్డి, చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను అడ్డుకోవడం బీజేపికి సరికాదు

**-బీజేపి ఏనాడూ పేద ప్రజల పక్షాన నిలువలేదు**

**-బీజేపి మాయమాటలు ప్రజలు నమ్మవద్దు**

**-బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు పల్లె వంశీకృష్ణ**

దుబ్బాక టౌన్, అక్టోబర్ 14, మనం న్యూస్ః రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపి పార్టీ అడ్డుకోవడం సరికాదని బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు పల్లె వంశీకృష్ణ అన్నారు. శనివారం రోజున ఎంపి క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం దళితుల కోసం దళితబంధు, బిసిల కోసం బిసి బంధు, మైనార్టీల కోసం మైనార్టీ బంధు పథకాలను అలాగే సొంతింటి కల నెరవేర్చేందుకు సొంత జాగా ఉన్న ప్రజలకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ. 3 లక్షలు అందించాలనే ఉద్దేశంతో పథకాలను ప్రవేశపెడితే దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఈ పథకాలన్నీ ఆపాలంటూ ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. బీజేపి పార్టీ పేద ప్రజల పక్షాన ఎప్పుడూ అండగా ఉండదని దీన్నిబట్టే అర్థమవుతుందన్నారు. కేంద్రం నుండి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాని ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన పనులను తానే చేశానని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను ప్రవేశపెట్టి లబ్ధిదారులను ఎంపిక చేసిందని, కానీ ఈ పథకాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా పేదల పక్షాన ఎవరు నిలుస్తున్నారో




ప్రజలందరికీ తెలుసని, ఎన్నికల ముందు మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దని, దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే ఎంపి ప్రభాకర్‌రెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచాడని, కారు గుర్తుకు ఓటేసి ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి యెల్లారెడ్డి, నాయకులు రొట్టె రాజమౌళి, బిఆర్ఎస్ యున్సిపల్ యూత్ అధ్యక్షులు భూపాల్, నాయకులు గన్నె భూంరెడ్డి, ఎంగారి రాజిరెడ్డి, దేవుని రాజు, కొత్త కిషన్‌రెడ్డి, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**-పోలీస్ కమీషనర్ శ్వేత**



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 14, మనం న్యూస్ః తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. సిద్దిపేట పట్టణంలోని పారుపల్లి వీధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెదక్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణ ఉంటుందని, పరీక్ష కేంద్రం నుండి 500 మీటర్ల దూరం వరకు ఈనెల 16వ తేదీ నుండి 26వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

**ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు చంద్రశేఖర్**

జగదేవ్‌పూర్, అక్టోబర్ 14, మనం న్యూస్ః అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని జగదేవ్‌పూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపు 400 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేస్తే మహాపుణ్యం అని ముక్కోటి దేవతలకు ఒకేసారి పూజ చేసిన పుణ్యం కలుగుతుందని ప్రతి అమావాస్య రోజున అన్నదానం నిర్వహిస్తున్న వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదన్నారు. మనం సంపాదించిన దాంట్లో లేని తృప్తి ఇతరులకు సేవ చేయడంలోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సంజయ్, కొండల్, బుద్ధ నాగరాజు, హరినాథ్, శ్రీనివాస్, సత్యపాల్, విఠల్, శ్రీనివాస్, అమర రాము, సత్యం, రఘు రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకే ఉచిత మెగా వైద్య శిభిరం

**సర్పంచ్ తీగుళ్ల జహంగీర్**



జగదేవ్‌పూర్, అక్టోబర్ 14, మనం న్యూస్ః ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహించినట్లు మెడిసిటి ఆసుపత్రి వైద్యులు, కొండాపూర్ సర్పంచ్ తీగుళ్ల జహంగీర్ తెలిపారు. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో శనివారం మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిభిరాన్ని స్థానిక సర్పంచ్ జహంగీర్ ప్రారంభించారు. ఈ శిభిరంలో బిపి, షుగర్, కంటి పరీక్షలతోపాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, గర్భసంచికి సంబంధించిన పలు పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను సైతం ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాము, మెడిసిటీ ఆసుపత్రి వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి పరితపించే వ్యక్తి ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**-లబ్ధిదారులను ఎంపిక చేయకుండానే**

**బిఆర్ఎస్ బూటకపు మాటలు**

**-నిరుద్యోగులు, పేద ప్రజల జీవితాలతో బిఆర్ఎస్ చెలగాటం**

**-బీజేపి మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి**

దుబ్బాక టౌన్, అక్టోబర్ 14, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై తప్పుడు మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ అన్నారు. శనివారం రోజున దుబ్బాక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎల్లప్పుడూ దుబ్బాక అభివృద్ధే తన ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యేపై బిఆర్ఎస్ నాయకులు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆపాలంటూ ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారని బదనాం చేయడం సరికాదన్నారు. దళితబంధు ప్రారంభించినపుడు వంద మందికే ఇచ్చారని, రెండో విడత దళితబంధు ద్వారా ఇంత వరకు ఏ ఒక్క లబ్ధిదారుడిని కూడా ఎంపిక చేయలేదన్నారు. బిసిబంధు పథకం కూడా ఒక




బూటకమని, గ్రామానికి ఇద్దరు కూడా పథకం ద్వారా లబ్ధి పొందలేదన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులు ఎవరు ఇంత వరకు ప్రజలకు తెలియదని, ఎన్నికల ముందే లబ్ధిదారులను ఎంపిక చేస్తే గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులపై వారి పేర్లు ఎందుకు ప్రకటించలేదో తెలపాలన్నారు. ఎన్నికల కోడ్ రాగానే దొంగచాటున తెరాస నాయకులకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలుపరచాలని చూస్తున్నారని, పేద ప్రజల పట్ల బిఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు.

నిజంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఉంటే స్థానిక శాసనసభ్యుడైన రఘునందన్‌రావును ఎందుకు పిలువలేదన్నారు. దళితులను, బిసిలను బీజేపి పార్టీకి దూరం చేయాలనే కుట్రపూరిత ఆలోచన కనబడు తుందని, బిఆర్ఎస్ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు. గ్రూప్ – 2 పరీక్ష రద్దయి హైదరాబాద్‌లో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే దొంగచాటున పోలీసులను పెట్టి విద్యార్థులను చెదరగొట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇటు నిరుద్యోగులను, అటు పేద ప్రజల జీవితాలతోనూ ఆడుకుంటున్న ఈ బిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పి రానున్న రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివకుమార్ గౌడ్, బిసి మోర్చ ఉపాధ్యక్షులు పుట్ట షాదుల్ స్వామి, సుంకోజి ప్రవీణ్, పగుడాల నరేందర్, కిష్టమ్మగారి నరేష్‌రెడ్డి, మరాటి బాబు, రమణారెడ్డి, యాదగిరి, సంజీవులు, సప్తగిరి, బాచి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

-మొదలైన బతుకమ్మ సంబరాలు

-మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ నిమజ్జనం









మిరుదొడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను, ఆచారాలను చాటి చెప్పే అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ చిన్నా పెద్ద అనే తేడా లేకుండా మహిళలందరూ కలిసికట్టుగా జరుపుకునే పండుగ బతుకమ్మపండుగ. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పండుగ సంబరాలు చాలా కీలకమైన పాత్ర పోషించాయి. ప్రకృతి సిద్ధంగా లభించే రకరకాల పూవులతో బతుకమ్మను పేర్చి పూవులను పూజించే పండుగ. బతుకమ్మలో పల్లెవాసుల జీవన శైలి, గ్రామిక రైతుల బతుకు చిత్రం ఇమిడి ఉంటుంది. పుడమి పలకరింపు, ప్రకృతి పరవశం బతుకమ్మలో లీనమై ఉన్నాయి. బతుకమ్మ పండుగకు చాలా కథనాలు ప్రాచుర్యంలో ఉండడం జరిగింది. బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలందరూ తమకు ఎలాంటి ఆపదలు రాకూడదని, తమ భర్త, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దని బతుకమ్మను వేడుకుంటారు. బతుకమ్మను ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజులు ఆటపాటలతో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. ఒక్కొక్క రోజు ఒక్కొక్క పేరుతో బతుకమ్మను పేరుస్తారు. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మ, రెండవ రోజున అటుకుల బతుకమ్మ, మూడవ రోజున ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవ రోజున నానబియ్యం బతుకమ్మ, ఐదవ రోజున అట్ల బతుకమ్మ, ఆరవ రోజున అలిగిన బతుకమ్మ, ఏడవ రోజున వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజున వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదవ రోజున సద్దుల బతుకమ్మ అని పిలుస్తూ తొమ్మిది రోజులు తొమ్మిది రకాల ప్రసాదాలతో అమ్మవారిని పూజిస్తారు. తొమ్మిదవ రోజైన సద్దుల బతుకమ్మనాడు ఆనందోత్సాహాలతో ఆడిపాడి బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా శనివారం మిరుదొడ్డితోపాటు ఆయా గ్రామాల్లో వివిధ రకాల పూవులతో బతుకమ్మను పేర్చి అంగరంగ వైభవంగా బతుకమ్మ ఆటలాడారు.

## దళిత వ్యతిరేకి రఘునందన్‌రావు

డిడబ్ల్యూజేఏఎస్ జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 14, మనం న్యూస్: దళితుల అభ్యున్నతి, ఆర్థిక ఎదుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు అమలుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అడ్డుపడడం అవివేకమని డిడబ్ల్యూజేఏఎస్ జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో జర్నలిస్టుగా, న్యాయవాదిగా, ప్రజాప్రతినిధిగా అనుభవం ఉన్న రఘునందన్‌రావుకు దళితులు ఎదగడం ఇష్టం లేదనే విషయం ఆయన ఎన్నికల కమీషన్‌కు చేసిన ఫిర్యాదే నిదర్శనమన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో దళిత జర్నలిస్టులకు ఎలాంటి సహాయం చేయకపోయినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతుంటే అడ్డుపడడం నీచమైన చర్యగా అభివర్ణించారు. దుబ్బాక నియోజకవర్గంలోని దళితులందరూ ఓటుతో బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దళితబంధు పథకం ఎన్నికలకు ముందు నుండే అమలవుతుందని, ఎన్నికల కోడ్ వెలువడక ముందే జిల్లాలోని దళిత జర్నలిస్టులకు ఆ పథకం వర్తింపజేయాలన్నారు. ఇకనైనా దళిత బిసిల పట్ల మీ పద్ధతి మారకపోతే గతాన్ని, చేసిన తప్పిదాలను దుబ్బాక నియోజకవర్గంలో గడప గడపకు ప్రచారం చేసి ఓటమికి కృషి చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి చంద్రం, ఏబిఎన్ బాబురావు, రంగరాజు, రాజు, పిఆర్ఓ ఎర్ర నర్సయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్‌పిఎస్‌సి బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలి

-సిద్దిపేటలో జాతీయ రహదారిపై రాస్తారోకో

-భారీగా నిలిచిపోయిన వాహనాలు



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 14, మనం న్యూస్: టిఎస్‌పిఎస్‌సి బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని బిఎస్పీ, పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. సడక్ బంద్‌లో భాగంగా బిఎస్పీ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుండి రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీగా జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బిఎస్పీ జిల్లా అధ్యక్షులు మోహన్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. శ్రీకాంత్, ప్రజా ఫ్రంట్ నాయకుడు సత్తయ్య మాట్లాడుతూ టిఎస్‌పిఎస్‌సి బోర్డును వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్ధత వల్ల హైదరాబాద్‌లో ప్రవళిక అనే నిరుద్యోగ యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చసుకుందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యే అని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులు దౌర్భాగ్యమైన స్థితికి నెట్టివేయబడ్డారని, అన్ని పోటీ పరీక్షలను లీక్ చేసి, వాయిదాలు వేసి నిరుద్యోగులను మానసికంగా హింసిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే బోర్డు ఛైర్మన్ జనార్ధన్‌రెడ్డిని విధుల నుండి తొలగించిన తర్వాతనే అన్ని పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి నిరుద్యోగి రూ. 3 లక్షల నష్టపరహారం చెల్లించాలని, అన్ని రకాల ఉద్యోగ ఖాళీలను గుర్తించి మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, అసెంబ్లీ అధ్యక్షులు పుల్లూరి ఉమేష్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్, బిఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి అశోక్, నేతు బాబు, వెంకటేశ్వర్లు, మల్లేశం, భాను, ప్రశాంత్, మహేష్, పిడిఎస్‌యు నాయకులు హివంత్, సాయితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కోనాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధేమీ లేదు

గ్రామ సర్పంచ్, బీజేపి నాయకులు పంచం స్వామి



దౌల్తాబాద్, అక్టోబర్ 14, మనం న్యూస్: దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో ఏకగ్రీవ సర్పంచ్‌నైన నేను బిఆర్ఎస్ పార్టీలో ఉండి అభివృద్ధి చేయలేకనే ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిలో భాగమై బీజేపిలో చేరడం జరిగిందని సర్పంచ్ , బీజేపి నాయకులు పంచం స్వామి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోనాపూర్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేవని, తాను పార్టీ మారడం ఓర్వలేకే బీజేపి పార్టీపై, తనపై బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వారు విమర్శించినంతమాత్రాన ఒరిగేదేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా రఘునందన్‌రావు మరోసారి భారీ మెజార్టీతో గెలవడం తథ్యమని, దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బీజేపి పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి గ్రామాధ్యక్షులు రమేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, అనిల్‌రెడ్డి, బాలస్వామి, వెంకటేశం, అశోక్, రాజు, ప్రభాకర్, స్వామి, రాజు పాల్గొన్నారు.

# పండుగ పూట విషాదం

## ప్రమాదవశాత్తు ముగ్గురు సఫాయి కార్మికుల మృతి

జగదేవ్‌పూర్, అక్టోబర్ 14, మనం న్యూస్ః బతుకమ్మ పండుగ కోసం చెరువును శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మెట్లపై నుండి జారి చెరువులో పడడంతో ముగ్గురు సఫాయి కార్మికులు మృతి చెందిన విషాద ఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బతుకమ్మ పండుగ తొలి రోజైన శనివారం రోజు నుండి తొమ్మిది రోజుల పాటు ప్రజలు బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అయితే చెరువు వద్దకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీగుల్ గ్రామంలో చెరువు కట్ట వద్ద గల బతుకమ్మ ఘాట్ వద్ద పిచ్చి చెట్లు పెరగడంతో చెట్లను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు తీగుల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేసే సఫాయి కార్మికులైన బాబు (25),





గిరిపల్లి భారతి (40), ఏళ్లం యాదమ్మ (43)లు బతుకమ్మ ఘాట్ వద్ద గల మెట్లపై నుండి జారి చెరువులో పడి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భాను ప్రకాష్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీగా చెరువు వద్దకు చేరుకోవడంతో గ్రామంలో పండగ పూట విషాద ఛాయలు అలుముకున్నాయి. గల్లంతైన వారిని గజ ఈతగాళ్ల సాయంతో వెతుకుతున్నారు. క్రమోల్ల బాబుకు భార్య స్వప్న, ఇద్దరు కుమారులు శ్రీవర్ధన్, అయాన్, గిరిపల్లి భారతి భర్త కొద్ది రోజుల క్రితం మృతి చెందగా కొడుకు వంశీ 6వ చదువుతుండగా కుమార్తె శ్యామలకు పెళ్లి జరిగింది. ఎల్లం యాదమ్మకు భర్త భూమయ్య, కుమారుడు మహేష్ 9వ తరగతి చదువుతుండగా కుమార్తె మాధవి వివాహం జరిగింది. ముగ్గురు చెరువులో గల్లంతవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా బాధిత కుటుంబీకులు రోధిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.



## మొదలైన బతుకమ్మ సంబరాలు

### తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు



దుబ్బాక, అక్టోబర్ 14, మనం న్యూస్ః తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దుబ్బాక పట్టణ కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మొదటి రోజైన మహాలయ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మచే ఘనంగా ప్రారంభించారు. మహిళలకు ప్రత్యేకమైన ఈ పండుగలో మొదటి రోజున ఎంగిలిపూల బతుకమ్మను ఉదయమే వివిధ రకాల పువ్వులు, గునుగుపువ్వుతో కలిపి బతుకమ్మగా పేర్చి సాయంత్రం వేళలో ఇంటి వద్ద ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించి బతుకమ్మ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ మహిళలు దుబ్బాక పెద్ద చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ కాసేపు సరదాగా గడిపి చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

## వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో మహాలయ అమావాస్య అన్నదానం



గజ్వేల్, అక్టోబర్ 14, మనం న్యూస్ః వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లో మహాలయ అమావాస్యను పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. శనివారం అమావాస్య అన్నప్రసాద వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో బెల్దె లక్ష్మయ్య కిష్టమ్మ జ్ఞాపకార్థం అత్తెల్లి భారతమ్మ జ్ఞాపకార్థం అమావాస్య అన్నదానం నిర్వహించారు. వాసవి సేవా సమితి ఆధ్వర్యంలలో బెల్దె లక్ష్మయ్య కష్టమ్మ జ్ఞాపకార్తం, అత్తెల్లి భారతమ్మ జ్ఞాపకార్థం అమావాస్య అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని, అమావాస్య రోజున అన్నదానం నిర్వహిస్తే పుణ్యం లభిస్తుందన్నారు. బెల్దె శ్రీనివాస్, అతివ్తెల్లి బాలనర్సయ్య కుమారులు రాజేశం, శ్రీనివాస్, బాలేష్ కుటుంబ సభ్యులకు ముక్కోటి దేవతల అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి, దుర్గా ప్రసాద్, నంగునూరి సత్యనారాయణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్, ఇటిక్యాల సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



## దళిత వ్యతిరేకి రఘునందన్‌రావుకు బుద్ధి చెప్పాలి

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



తొగుట, అక్టోబర్ 14, మనం న్యూస్ః నిరుపేదలకు సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు తాను చేయరు, ఇతరులను చేయనివ్వరు అన్నట్లుగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు మరోసారి తన నిజ స్వరూపం చాటుకున్నాడని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల కోడ్ కంటే ముందు కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలుపుదల చేయాలని ఎన్నికల కమీషన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి నిరుపేదల పట్ల ఎమ్మెల్యేకు ఉన్న వ్యతిరేకటను చాటుకున్నారన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపి పథకంలో భాగంగా తెచ్చిన దళితబంధును నిలిపివేయాలని ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. దీంతో సంక్షేమ పథకాలపై పిర్యాదు చేసి బీజేపి దళిత వ్యతిరేక పార్టీ అని ఎమ్మెల్యే నిరూపించాడన్నారు. బిసిల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన బిసిబంధు పథకాన్ని కూడా నిలిపివేయాలని ఫిర్యాదు చేసి బిసి వ్యతిరేకి ఎమ్మెల్యే అన్నారు. తాను కేంద్రం నుండి రూపాయి తీసుకురాలేదు కానీ కేసీఆర్ సర్కార్ అందించే పథకాలను అడ్డుకోవడం వల్ల తన క్రిమినల్ బుద్ధిని చూపారన్నారు. ఎన్నికల కోడ్ కన్నా ముందే ఎంపకైన పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు ఇవ్వకుండా దుబ్బాక నియోజకవర్గ ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిలిపివేయాలని కుట్రలు చేస్తున్న రఘునందన్‌రావును ఎక్కడికక్కడే నిలదీయాలని పిలుపునిచ్చారు.

## సోషల్ మీడియాలో అవమానకర పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు



పాపన్నపేట, అక్టోబర్ 14, మనం న్యూస్ః ఎన్నికలు సమీ పిస్తున్న దృష్ట్యా సోషల్ మీడియా లో అవమానించే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి హెచ్చరిం చారు. శనివారం ఆయన మా ట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ గ్రూపులపై ఇతర వ్యక్తులకు పార్టీలను రెచ్చగొట్టే విధంగా కించపరిచేలా అవమానిస్తూ పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

## బిఆర్ఎస్‌లో ఎలాంటి అసమ్మతి సెగలు లేవు

### కోనాపూర్ సర్పంచ్‌పై గులాబీ నాయకుల ఆగ్రహం



దౌల్తాబాద్, అక్టోబర్ 14, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సబ్బండ వర్గాలకు ప్రతి గ్రామంలో అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ కృషి చేస్తూ వస్తుందని బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు చిటుకుల స్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో గానీ మండలంలోగానీ సర్పంచ్ స్వామికి ఎక్కడా బిఆర్ఎస్ తరుపున అన్యాయం జరగలేదన్నారు. సర్పంచ్ పార్టీని వీడినంత మాత్రాన గ్రామాభివృద్ధి ఆగదని, బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కొనసాగిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎంపి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అందె రాజిరెడ్డి, సీనియర్ నాయకులు తిప్పగౌని బుచ్చాగౌడ్, వార్డు సభ్యులు పంచమి శ్రీకాంత్, సీనియర్ నాయకులు తిప్పగౌని బుచ్చాగౌడ్, స్వామి, ప్రవీన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, జోడు యాదగిరి, సత్తయ్య, ఎల్లయ్య, పర్శరాములు, రాములు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



జిన్నారం, అక్టోబర్ 14, మనం న్యూస్ః తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల సందర్భంగా శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లన్న బస్తీలో నిర్వహించారు. బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, కౌన్సిలర్ వి. చంద్రారెడ్డి నివాసం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సందడిగా బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మలను అందంగా అలంకరించి వాటి చుట్టూ ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో మహిళలు వి. ప్రమీల, వి. ప్రత్యూష, అనిత, సునీత, రూప, పద్మ, సౌందర్య, అరుణ, రాణి, అనూష, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

## -మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## -మల్లంపేట పోలింగ్‌బూత్ పరిశీలన



పాపన్నపేట, అక్టోబర్ 14, మనం న్యూస్ః ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లంపేట పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధులను విస్మరించిన ఎన్నికల సూపర్‌వైజర్ రాధాకృష్ణను సస్పెండ్ చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ బూత్‌ల వద్ద మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితాలను పరిశీలించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని,



పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లలేని స్థితిలో ఉన్న వికలాంగులను గుర్తించి వారికి డాక్టర్లు నిర్ధారించిన సదరం సర్టిఫికేట్‌లను జతచేసి నడవలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఓటు హక్కు కలిగి ఇతర దేశాల్లో ఉన్న వారి ఓటు హక్కు సైతం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి పలోఇంగ్ బూత్‌లలో వీల్‌చైర్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కుకు నమోదు చేసుకునేందుకు ఈనెల 30 వరకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మల్లంపేట సర్పంచ్ బాపురెడ్డి, పిఆర్ఈఈ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పితృ అమావాస్య ఎంగిలిపూల బతుకమ్మ

మిరుదొడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్ః అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పితృ అమావాస్య సందర్భంగా శనివారం బతుకమ్మలను మహిళలు ఉదయం నుండే వివిధ రకాల పువ్వులు తీసుకువచ్చి బతుకమ్మగా పేర్చి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద అంతా ఒకచోట చేరి బతుకమ్మలను ఒకచోట పేర్చి బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. శనివారం మొదలైన బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజుల పాటు నిర్విరామంగా కొనసాగనున్నాయి.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే వారిని వెంటనే అరెస్ట్ చేయాలి




సిద్దిపేట, అక్టోబర్ 14, మనం న్యూస్ ప్రతినిధిః ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ టిటిడి మాజీ బోర్డు మెంబర్ మురంశెట్టి రాములు గోడలపై రాసిన రాతలు దేనికి సంకేతమని, వెంటనే అతన్ని అరెస్ట్ చేయాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. మురంశెట్టి రాములును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి, సిపికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. సిద్దిపేటలో ఎన్నికలు దండగ అంటూ గోడలపై వందల సంఖ్యలో రాతలు రాయిస్తున్నారని, ఓటు అనేది ప్రజాస్వామ్య హక్కు అని, దానిని అపహాస్యం చేసేలా రాములు వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన వ్యవహరించిన తీరు రాజ్యాంగవిరుద్ధమన్నారు. ఆయనపై చర్యలు తీసుకునేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి మధు, గయజుద్దీన్, రషీద్, అనిల్ పాల్గొన్నారు.

## ఎక్కడికక్కడ రఘునందన్‌రావును నిలదీయాలి

### ఎమ్మెల్యే ఫిర్యాదు పట్ల సర్పంచ్‌ల ఆగ్రహం



దౌల్తాబాద్, అక్టోబర్ 14, మనం న్యూస్ః బిఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసి బిసి బంధు దళితబంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు వంటి పథకాలను సీఎం కేసీఆర్ నిరంతర ప్రక్రియగా ప్రతి నెలలో కొంతమందిని ఎంపిక చేసి ఇస్తుంటే రఘునందన్‌రావు ఎన్నికల కోడ్ ఉంది కాబట్టి ఎమ్మెల్యేగా గెలవడం కష్టంగా భావించి ఈ పథకాలను ఆపాలని ఎన్నికల కమీషన్‌కు స్వయంగా లెటర్ రాసి కమీషన్‌కు ఫార్వర్డ్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజల సంక్షేమానికి నిరంతరం తాపత్రయపడుతున్న బిఆర్ఎస్ పార్టీ పథకాలను ఆపివేయాలని ఎమ్మెల్యే చూడడం చూస్తుంటే ఆయనకు ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. ప్రజలకు కనీస సంక్షేమ పథకాలు అమలవుతుంటే చూసి ఓర్వలేని రఘునందన్‌రావుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని, బీజేపీ పార్టీకి కనీసం డిపాజిట్ కూడా దక్కకుండా చూడాలని ప్రజలకు సూచించారు. కావున ప్రజలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు రఘునందన్‌రావు మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అంతేకాకుండా గ్రామాల్లో ప్రచారానికి వచ్చే సమయంలో ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు.



## జక్కుల స్వామి అంత్యక్రియల్లో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

### -పాడెమోసి శ్రద్ధాంజలి ఘటించిన శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్, అక్టోబర్ 14, మనం న్యూస్ః గత నాలుగు రోజుల క్రితం మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల శివారులో బైక్ అదుపుతప్పి పడడంతో వెంటనే కోమాలోకి వెళ్లడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు దౌల్తాబాద్ మండల పరిధిలోని షేర్‌పల్లి బందారం గ్రామానికి చెందిన జక్కుల స్వామి మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం అంత్యక్రియల్లో పాల్గొని పాడెమోసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ తరుపున అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పడాల రాములు, మాజీ అధ్యక్షులు దశరథరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య చికిత్స

### ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం

### గాయపడ్డ కార్మికులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరామర్శ



జిన్నారం, అక్టోబర్ 14, మనం న్యూస్ః జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని అమర లాబ్స్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రియాక్టర్ల పేలుడులో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరిలో ఐదుగురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉందని తెలియడంతో వెంటనే మంత్రి హరీష్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే జీఎంఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామని, ప్రమాద ఘటనలో పరిశ్రమ నిర్లక్ష్యం కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పరిశ్రమ కార్మికుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించడం జరిగిందన్నారు. ప్రభుత్వంతోపాటు పరిశ్రమ యాజామాన్యంతో చర్చించి కార్మికులకు మెరుగైన పరిహారం అందిస్తామన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు వరప్రసాద్‌రెడ్డిలు ఉన్నారు.

## సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు

### నవభారత్ నిర్మాణ్ యువసేన



పటాన్‌చెరు, అక్టోబర్ 14, మనం న్యూస్ః ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వరంగల్‌కు చెందిన పల్లవి అనే యువతి ఆత్మహత్య చేసుకోవడంపై నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షులు మెట్టు శ్రీధర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం వెతకాలని, ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వం పదే పదే పరీక్షలను రద్దు చేయడం, వాయిదా వేయడంతో నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారన్నారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో ఖచ్చితత్వంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారు కానీ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని, పరీక్షలు కాకుండా ఎన్నికలు వాయిదా వేయాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులెవరూ అధైర్యపడవద్దని, విలువైన ప్రాణాలను క్షణికావేశంలో తీసుకొని తల్లిదండ్రులకు కడుపుకోతను మిగల్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



## కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయం

### సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్



జిన్నారం, అక్టోబర్ 14, మనం న్యూస్ః జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 500లకే గాయస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, ప్రతి మహిళకు రూ. 2500లు ఇస్తామని, ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, రైతు కూలీలకు, భూమిలేని రైతులకు సైతం రైతుబీమా పథకం వంటివి అమలు చేస్తామని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిపి, రవిందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఉప సర్పంచ్‌లు, ఊట్ల గ్రామ ఉప సర్పంచ్ రవిందర్, రమేష్, ఎస్సీ సెల్ అసెంబ్లీ అధ్యక్షులు మహేష్, యూత్ కాంగ్రెస్ జిన్నారం మండల అధ్యక్షులు నరేందర్, గ్రామాధ్యక్షులు సుధాకర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

### టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



సంగారెడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్ః బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం సదాశివపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్‌లో యువత భారీగా చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ మీ కోసమే పని చేసే వ్యక్తిని ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎవరికీ కనిపించకుండా నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా ఉంటున్నాడన్నారు. అలాంటి వ్యక్తి అభివృద్ధి ఏం చేయగలడన్నారు. ప్రజలకు నిరంతరం సేవే లక్ష్యంగా భావించే వ్యక్తి చింతా ప్రభాకర్‌ను ఈసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. దేశమంతా ఆశ్చర్యపోయే విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సీఎం కేసీఆర్ నిలుపుతున్నారన్నారు. యువత బిఆర్ఎస్ వైపు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింత గోపాల్, కౌన్సిలర్లు విశ్వనాథం, చౌదరి ప్రకాష్, నస్రీన్, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కేసి పువ్వేసి చందమామ...





సిద్దిపేట రూరల్, అక్టోబర్ 14, మనం న్యూస్ః ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ వాడవాడలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. భవిష్యత్ తరాలకు తెలంగాణ సాంప్రదాయాన్ని, సంస్కృతిని వివరిస్తూ అందమైన పాటలతో బతుకమ్మ ఆటను ఆడపడుచులు ఆడారు. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. పల్లెపల్లెలో, వాడవాడలో పల్లెలన్నీ మారుమోగాయి. 24వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆటలో పాల్గొని పాటను బాణీ కలిపారు. ఆడపడుచులందరూ బతుకమ్మలను ఒక్కొక్క పువ్వుతో పేర్చి అందంగా తయారు చేసి ఒకదగ్గర చేరి బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను కోమటి చెరువులో నిమజ్జనం చేశారు.







## ఉచిత వైద్య శిభిరం ప్రారంభించిన యువ నాయకులు ప్రవీణ్‌రెడ్డి



జిన్నారం, అక్టోబర్ 14, మనం న్యూస్ః జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీ పరిధి పోచమ్మ బస్తీలో సిద్ధార్థ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిభిరాన్ని మున్సిపల్ బిఆర్ఎస్ యువత నాయకుడు వి. ప్రవీణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక వాడలోని పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో సిద్ధార్థ ఆసుపత్రి క్యాంప్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్యాంప్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడమే కాకుండా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గావతి దేవి, శ్రీకాంత్, పరంశీల గీతదేవి, ఆశ సుమిత్ర, శివమని, శివప్రసాద్, సాయి, నవీన్, సిద్ధార్థ ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి

### -నిబంధనలకు లోబడి ఎన్నికల ప్రచార సామాగ్రిని ముద్రించాలి

### -జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్ః సాధారణ ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీలు, ప్రజలతోపాటు రాజకీయ పార్టీలకు ప్రచారాల నిమిత్తం ముద్రించే సామాగ్రిని సైతం ఎన్నిక నిబంధనలకు లోబడి, ఎన్నికల నియమావళి పాటిస్తూ ముద్రించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజాప్రాతినిధ్య చట్టం 1957, 127 'ఎ' సెక్షన్ ప్రకారం ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలకు లోబడి పని చేయాలని, నిబంధనలను అనుసరించి ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించేటపుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణకర్త పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్లు స్పష్టంగా ముద్రించాలని, ముద్రించిన ప్రతులకు సంబంధించి ప్రచురణకర్త నుండి పొందిన డిక్లరేషన్‌తో సహా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అదికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. కరప్రతాలు, పోస్టర్లు మొదలైన వాటి ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రొఫార్మాలో ప్రచురణకర్త నుండి డిక్లరేషన్ పొందాలన్నారు. సదరు ప్రింటింగ్ పనికి వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారం కూడా అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## కాంగ్రెస్ టికెట్ ముఖిమ్‌కే కేటాయించాలి



సంగారెడ్డి, అక్టోబర్ 14, మనం న్యూస్ః మన ఈను ఫౌండేషన్ అధినేత ముఖింకే కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని శనివారం మన బీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదాశివపేటలోని టిజేఏసి జిల్లా అధ్యక్షులు గొల్ల సత్తయ్య యాదవ్ నివాసంలో వారు మాట్లాడారు. మన బీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని నిరుపేదలకు, బీదలకు, విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న విద్యావేత్త, సుప్రీం కోర్టు న్యాయవాది ఎం.ఏ. ముఖిమ్‌కు ఈసారి సంగారెడ్డి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు కొత్తవారికి అవకాశం ఇచ్చే విఃగా ఉన్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలకు అందుబా టులో ఉండక నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడుతుం దన్నారు. నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యావేత్త, సుప్రీంకోర్టు న్యాయవాది అయిన ముఖింకే టికెట్ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మునిపల్లి రమేష్, దళిత నాయకులు ప్రభు, జార్జ్, శంకర్ నాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.